క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న హెచ్ఎం విజయ నిర్మల

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు క్లాంపెక్స్ హెచ్ఎం విజయ నిర్మల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. పుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందించాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: గీతా పారిశ్రామిక సహకార సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రమోహన్, ఉపాధ్యక్షుడిగా బొమ్మన రాంచంద్రగౌడ్, సెక్రెటరీగా బుచ్చిరాములుగౌడ్, డైరెక్టర్‌లుగా బాలేశ్వర్ గౌడ్, సత్యనారాయణగౌడ్, రాఘవగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ముంజం కమల, చాయాదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గడ్డం లక్ష్మణ్, ఎక్సైజ్ సీఐ రమేశ్ వ్యవహరించారు.

స్కావెంజర్ల ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

కాగజ్‌నగర్ రూరల్: పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో స్కావెంజర్ల పాత్ర కీలకమని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో స్కావెంజర్లకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని తరగతి గదులు, టాయిలెట్స్‌లను శుభ్రంగా ఉంచుతూ, చెట్లకు ప్రతీ రోజు నీరు అందించాలన్నారు. పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రాజమణి, కమల, శాంత, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

‘అటవీ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి’



మాట్లాడుతున్న కూటికల అనంద్‌రావు

కెరమెరి: పోడు భూములు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేదలపై అటవీ అధికారులు చేస్తున్న దౌర్జన్యాలు ఆపాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెంచికల్‌పేట్, తదితర మండలాల్లో తరచూ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని మాలిని గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం మాలిని, చిన్నమాలిని గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు విద్యుత్ తీగలు ఇళ్లపై పడ్డాయని, ఇబ్బంది పడుతున్నామన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ మహేశ్, ఏపీవో చంద్రశేఖర్, బాబురావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను జిల్లా కేంద్రంలోని 5, 11, 18వ వార్డులకు చెందిన లబ్ధిదారులకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అందజేశారు. అర్హులైన 150 మంది ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, నాయకులు రాపర్తి కార్తీక్, గోవింద్, సాయి, జావిద్, అబ్బు, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

బొప్పరానికి రోడ్డు నిర్మించేదెప్పుడు?

- నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని పనులు
- వర్షాకాలంలో తప్పని దారి కష్టాలు
- పట్టించుకోని అధికారులు



బొప్పరం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు

దహెగాం: ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నా.. ఆదివాసీ గ్రామాలు మాత్రం అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మండలంలోని ఆదివాసీ గ్రామమైన బొప్పురం గ్రామానికి పార్వతి పేట నుంచి బొప్పురం గ్రామం వరకు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో బొప్పురానికి రోడ్డు నిర్మాణం ఎప్పుడు చేపడుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.,

రూ. 3.13 కోట్లు మంజూరు..

బొప్పురం గ్రామానికి జనవరిలో పార్వతిపేట గ్రామం నుంచి బొప్పురం వరకు సుమారు కిలోమీటరు బీటీరోడ్డు నిర్మాణానికి ఎస్టీ ఎస్‌డీఎఫ్ కింద రూ. 3.13 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరై 5 నెలలు కావస్తున్నా నేటికి పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు నిర్మాణం ఇంకా టెండర్ దశలోనే ఉందని అధికారులు పేర్కొంటున్నారు. టెండర్లు ఎప్పుడు వేస్తారు, రోడ్డు పనులు ప్రారంభం ఎప్పుడు చేస్తారు? అంటూ.. గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు..

పార్వతిపేట నుండి బొప్పురం వరకు మట్టి రోడ్డు ఉంది. వర్షాకాలంలో రోడ్డంతా బురదగా మారుతుంది. నడవలేని పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. బొప్పురం గ్రామంలో సుమారు 20 కుటుంబాలు ఉండగా 100 మంది వరకు గిరిజన జనాభా ఉంది. రెండు గ్రామాల మధ్య వాగు ఉండడంతో వర్షాకాలంలో భారీ వర్షాలకు ఉప్పొంగి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. బొప్పురం గ్రామం నుంచి సుమారు 15 మంది విద్యార్థులు ప్రతీ రోజు పార్వతి పేట గ్రామంలోని పాఠశాలకు వస్తుంటారు. వర్షాకాలంలో విద్యార్థుల తల్లిదండ్రులు వాగు వరకు వచ్చి దాటించి వెళ్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి బీటీ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



బొప్పురం గ్రామానికి సరైన రోడ్డు లేదు. వర్షాకాలంలో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఏ అవసరమైన దహెగాం మండల కేంద్రానికి పోవాలి. రోడ్డు లేనందున వర్షాలకు బురదలో కాలినడకన వెళ్లాల్సి వస్తుంది.

– గువ్వల వైకుంఠం, బొప్పురం

బురదగా మారుతుంది



వ్యవసాయ పొలాలు బొప్పురం శివారులో ఉన్నాయి. ఖరీఫ్ పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో చేనుకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఉన్న రోడ్డు బురదగా మారుతుంది. మధ్యలో వాగు ఉండడంతో దాటేందుకు ఇబ్బంది పడుతున్నాం.

– బొట్లకుంట నీలేశ్, పార్వతి పేట

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రత పూజలు



ఆసిఫాబాద్‌లో పూజలు చేస్తున్న మహిళలు



రెబ్బెన: మర్రిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



సంజీవనగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: జేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో మహిళలు మర్రిచెట్టు వద్ద వటసావిత్రి వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రాహ్మణవాడలోని మినీ ఫంక్షన్ హాల్‌లో మహిళలు వ్రతం ఆచరించారు. ముత్తయిదువలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అర్చకులు ఢిల్లీ విజయ్‌కుమార్, నరేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు చేపట్టారు.

రెబ్బెన: పట్టణంలోని ఇందిరానగర్‌లో బుధవారం మహిళలు వట సావిత్రి వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందిరానగర్‌లో మర్రిచెట్టు వద్ద మహిళలు ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలు చేశారు. మర్రిచెట్టును సింధూరంతో అలంకరించి నూలు దారం పోగులను చెట్టు చుట్టూ చుట్టి సౌభాగ్యానికి నిదర్శనమైన పసుపు, కుంకుమ, పూలు, గాజులు చెట్టు వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. చెట్టును త్రిమూర్తి స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. రోజంతా ఉపవాసం ఉండి చీకటిపడిన తర్వాత విరమించారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు, లగ్గాం, కుంచవెల్లి, గెర్రె,, చినరాస్పెల్లి గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం మహిళలు వటసావిత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మర్రి, రావిచెట్టు వద్ద పూజలు చేశారు. గెర్రె అభయాంజనేయ స్వామి ఆలయంలో మహిళలు మర్రి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెంచికల్‌పేట్: మండలంలోని సంజీవనగర్ రామాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం వటసావిత్రి పూజలు చేశారు. మర్రి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భర్త దీర్ఘాయువు, సుఖసంతోషాలు, సౌభాగ్యం ప్రసాదించాలని సావిత్రి దేవిని పూజించారు. నైవేద్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన ‘అరిగెల’

ఆసిఫాబాద్‌అర్బన్: చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్‌ను బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావ్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు.

మంత్రి వివేక్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ

బెజ్జూర్: తెలంగాణ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో సుభాష్

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాల గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచాలో వివరించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలకు నీరు పోయాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో సుభాష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో స్కూల్ శానిటరీ కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. మరుగుదొడ్ల శుభ్రత, తాగునీరు, వ్యర్థాల విసర్జన వంటి వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ కార్మికులు పాల్గొన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఆసిఫాబాద్‌రూరల్: భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. బుధవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రహమత్, సిబ్బంది నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ భూమేశ్వర్

కెరమెరి: భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని కెరమెరి, గౌరీ, భోలాపటార్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కెరమెరిలో 11 దరఖాస్తుల రాగా.. ఇతర గ్రామాల్లో ఒక్కటి కూడా రాలేదు. మిస్సింగ్ ఖాతా నంబర్లు, డీఎస్ పెండింగ్, పేర్లలో మార్పులు చేర్పులు, సర్వే నంబర్లు తప్పులు, విస్తీర్ణం తదితరాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పవన్ నాయక్, సేవంత, ఇర్షాద్, వసంత్, విజయలక్ష్మి, సురేశ్, బాపూరావు, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



పూలబొకే ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర సహజవాయువు, పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రెటరీ వినోద్ శేషన్‌కు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు వినతి పత్రం అందించారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చి తిరిగి వెళ్తున్న ఆయనను బుధవారం హైదరబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానశ్రయంలో కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఏఐబీపీ నుంచి నిధులు గతంలో కేటాయించిందని, మరో 10 శాతం నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేని పరిస్థితిలో ఉందన్నారు. పెండింగ్ పనుల కోసం రూ.150 కోట్లు కేటాయించాలని కోరారు. కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

గాలివాన బీభత్సం

సిర్పూర్(టి): మండలంలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలోని వ్యాపారసముదాయాల బోర్డులు, చెట్లు విరిగిపడ్డాయి. టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్టు గాలి దుమారానికి నేలకొ రగడంతో ఆలయ ప్రాంగణం ధ్వంసమైంది. సి ర్పూర్(టి)–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

సంక్షిప్త వార్తలు

బాల కార్మిక రహిత సమాజానికి కృషి చేయాలి

కాగజ్‌నగర్ రూరల్: బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని వల్లకొండ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. బాల బాలికల హక్కులకు బంగం కలిగించి బాల కార్మికులుగా మారిస్తే బాల కార్మికుల నిరోధక చట్టం 1986 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇటుక బట్టీల యజమానులు, ట్రాక్టర్ యజమానులు మైనర్ పిల్లల చేత పనులు చేయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అనిందిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో నూరుశాతం ఫీజులో రాయితీ ఇవ్వాలని కోరుతూ బుధవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల వారే జర్నలిస్టులుగా ఉన్నారని, ప్రైవేటు విద్యా సంస్థల్లో వారి పిల్లలకు ఫీజులో రాయితీని కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన జర్నలిస్టులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాష్‌గౌడ్, తారు, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) రేంజ్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వోగా ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వోగా బుధవారం ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సిర్పూర్(టి) రేంజ్ ఎఫ్ఆర్‌వోగా విధులు నిర్వర్తించిన ఇక్బాల్ హుస్సేన్ సెలవులపై వెళ్లగా.. జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వోగా ప్రవీణ్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. సిర్పూర్(టి) రేంజ్ అటవీశాఖ అధికారులు, సిబ్బంది శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఎఫ్ఎస్‌వోలు మోహన్‌రావ్, తిరుపతి, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మూతబడిన ఓసీపీలు తనిఖీ

రెబ్బెన: ఏరియాలో మూతబడిన ఓసీపీలను బుధవారం ప్రొఫెసర్ డాక్టర్ సుదీప్త ముఖోపాధ్యాయ్ సందర్శించారు. మైన్ క్లోజర్ యాక్టివిటీలో భాగంగా డోర్లి– 1, డోర్లి– 2 ఓసీపీలను తనిఖీ చేశారు. ముందుగా గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి మూతబడిన ఓసీపీల డంపింగ్ యార్డులు, ఇతర ప్రదేశాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా ఎదగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. డోర్లి– 1 వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, కార్పొరేట్ అధికారులు, అడిషనల్ మేనేజర్ తిరుపతి, శంకర్, డీవైఎస్ఎస్‌వో రామరాజ్, డోర్లి మేనేజర్ మహేశ్, ఫారెస్టు అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం షీటీం ఆధ్వర్యంలో ఎస్సై అంజయ్య అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాల్లో ఆడపిల్లలను ఎవరైనా ఆకతాయిలు వేధించినా, బ్లాక్‌మెయిల్ చేసినా, మత్తు పదార్థాలు సేవిస్తూ కనిపించినా షీటీంకు, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే షీటీం 87126 70564 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ మహిళల రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు డీఈవో సుభాష్ రాథోడ్, షీటీం సిబ్బంది స్వప్న, శ్రీలత, రజనీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో 43 మంది లబ్ధిదారుల జాబితాను పంచాయతీ కార్యదర్శి స్వయంగా బోర్డుపై ప్రదర్శించారని, కానీ ఆ తరువాత జాబితాలోని 18 మందిని తొలగించి అనుకూలంగా ఉన్న 25 మందికి ప్రొసీడింగ్ కాపీలు అందించారని ఆరోపించారు. తొలగించిన వారిలో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, ఇళ్లు లేని వారు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కమలాకర్‌కు సన్మానం

రెబ్బెన: సామాజిక రంగంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ పొందిన కొండగుర్ల కమలాకర్‌ను బుధవారం తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర కోకన్వీనర్ దుర్గం రవీందర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు రక్షణ చట్టం 2005పై కమలాకర్ చేసిన అవగాహన కార్యక్రమాలతో అత్యున్నత గౌరవ డాక్టరేట్ లభించిందన్నారు. సమాజానికి సేవ చేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు శ్రీనివాస్, పూదరి సాయి, పర్వతి సాయి, బాలు నాయక్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధి ఏర్పాటు హర్షణీయం

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని దేవాదాయశాఖ అర్చక, ఉద్యోగులు, దూపదీప నైవేద్యం అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం హర్షణీయమని డీడీఎన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయం ఆవరణలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటాలను క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సభ్యులు అభయ్ ఆచార్య, సుబ్బా మహేశ్‌శర్మ, సతీశ్‌శర్మ, ముత్తయ్యచారి, విజయ్‌కుమార్‌శర్మ, రాంచందర్, శేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. బుధవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజన కార్మికులు, స్కావెంజర్లను శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వంట సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. పకడ్బందీగా మెనూ అమలు చేయాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎంలు నానాజీ, రమేశ్, ఆర్‌పీలు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



టీబీజీకేఎస్ జెండా ఎగురవేస్తున్న సురేందర్‌రెడ్డి

రెబ్బెన: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో బుధవారం గేట్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇన్‌కం ట్యాక్స్ రద్దు, ఇంటి నిర్మాణానికి రూ.30లక్షల వడ్డీ లేని రుణం, 250 గజాల ఇంటిస్థలం మంజూరు వంటి అనేక హామీలను ఇచ్చి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపొందిందని తెలిపారు. సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు సరిపడా మందులు అందించడంలో సింగరేణి విఫలమవుతోందని ఆరోపించారు. 2024– 25 లాభాల వాటాను ప్రకటించి కోతలు లేకుండా వాటా పెంచి అందించాలన్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీలో టీబీజీకేఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఫిట్ కార్యదర్శి రమేశ్, ఏరియా కార్యదర్శులు అలవేణి సంపత్, మారిన వెంకటేశ్, సెంట్రల్ కమిటీ నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, రమేశ్, సత్తయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత బొగ్గు రవాణాకు చర్యలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో సురక్షిత బొగ్గు రవాణాకు చర్యలు చేపట్టామని జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. కైరిగూడ ఓసీపీ వద్ద ఆధునీకరించిన చెక్‌పోస్టును బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చెక్‌పోస్టు క్యాబిన్‌లోకి వెళ్లి బొగ్గు రవాణా చేస్తున్న వాహనాల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఆధునీకరించిన చెక్‌పోస్టుతో సమయం ఆదా అవుతుందన్నారు. లారీ క్లీనర్లు, డ్రైవర్లు వాహనాలు దిగకుండానే బొగ్గు రవాణాకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పంచాయతీలపై భారంగా ట్రాక్టర్ల నిర్వహణ



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పెంచికల్‌పేట్: గ్రామాల్లోని ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారిందని పెంచికల్‌పేట్ పంచాయతీ కార్యదర్శుల జేఏసీ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పంచాయతీల్లోని ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీవో అ ల్బర్ట్‌కు అందచేశారు. వారు మా ట్లాడుతూ ప్రభుత్వం గత కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులపైన పనిభారం తగ్గించడంతో పాటు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.